సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



ప్రభుత్వ ఉద్యోగులుగా..

డిమాండ్లను నెరవేర్చడంలో సర్కారు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- 9లో ▸



పనులు పూర్తి చేయాలి

అభివృద్ధిపనులలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అధికారులను ఆదేశించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /22.3

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'సాగర్' నీటి విడుదల



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలవల్ల శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని ఒక గేటు ఎత్తి మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ బోధించడానికి ఆసక్తిగలవారు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం మార్కులతో నెట్ లేదా సెట్ పాసైనవారు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఇతర వివరాల కోసం 85004 00635 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సబ్ జైల్‌లో న్యాయ చైతన్య సదస్సు



కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి సబ్ జైల్‌లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీదేవి సదస్సులో పాల్గొని చట్టాలు, ఉచిత న్యాయ సేవల గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు. ఏడుగురు ఖైదీల అభ్యర్థనను స్వీకరించి వారికి ఉచిత న్యాయ సహాయం చేయడానికి సిద్ధమయ్యారు. అనంతరం సబ్ జైల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అర్‌బీ రమేష్ చంద్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.మోహన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పల్లె చిరంజీవి, సబ్ జైలర్ గడ్డం గంగాకిషన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో కామారెడ్డి బార్ అధ్యక్షుడు



కామారెడ్డి టౌన్: ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ న్యాయవాదుల కాన్ఫరెన్స్‌కు కామారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్ హాజరైయ్యారు. ఈనెల 22, 23 తేదీలలో సదస్సు జరిగిందని శ్రీధర్ తెలిపారు. ఉచిత న్యాయ సహాయం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతులు, న్యాయ వ్యవస్థలో సమాన అవకాశాలు, కృత్రిమ మేధస్సు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించామని పేర్కొన్నారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'



కామారెడ్డి టౌన్: ఉద్యోగ నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగుల జీవితాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చెలగాటం ఆడుతున్నాడని మాజీ మంత్రి షబ్బీర్ అలీ మండిపడ్డారు. శనివారం ఆయన కామారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రూప్–1 పరీక్ష రద్దుకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో విఫలమైన టీఎస్‌పీఎస్సీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంపై నిరుద్యోగులు తిరగబడాలని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. గ్రూప్–1 పరీక్ష రాసిన అభ్యర్థులకు వెంటనే రూ. 2 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతుందని, పేపర్ లీకేజీల సర్కారుగా పేరు తెచ్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు తప్పకుండా ఇస్తామన్నారు.

ఏకదంతాయ.. విభిన్న రూపాయ..

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విగ్రహాల తయారీ
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న విగ్రహాలు, మండపాలు



వినాయక చవితి వచ్చిందంటే పల్లె, పట్నం తేడా లేకుండా అంతటా సందడి నెలకొంటుంది. భక్తులు విభిన్న రూపాల్లో ఉన్న గణనాథుడి ప్రతిమలను ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేస్తారు. ట్రెండ్‌కు అనుగుణంగా పలుచోట్ల చంద్రయాన్ గణపతిని ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. భారీ విగ్రహాలే కాకుండా పర్యావరణహిత గణపతి విగ్రహాలనూ ఈసారి ఎక్కువ సంఖ్యలోనే ప్రతిష్ఠించారు. జిల్లాలో విభిన్న రూపాలలో ప్రతిష్ఠించిన గణనాథులపై సండే స్పెషల్..

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాలను ప్రతిష్ఠించడంలోనూ ఆధునికత.. ఆపై ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్నాయి. ఏడాదికేడాది ఉత్సవాలలో కొత్తదనం కనిపిస్తూనే ఉంది. కొత్త ఆలోచనలతో విగ్రహాలను తయారు చేయించడం, మండపాల వద్ద ఏర్పాట్లు చేయడం ద్వారా మండపాల నిర్వాహకులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రాష్ట్రంలో వినాయక ఉత్సవాల నిర్వహణలో కామారెడ్డికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఇక్కడ తొమ్మిది రోజుల పాటు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. వినాయక విగ్రహాల ఏర్పాటు నుంచి మంటపాలను ముస్తాబు చేయడం వరకు ప్రత్యేకత కనిపిస్తుంది. నిమజ్జనం సైతం రెండు రోజుల పాటు కొనసాగుతుంది.

కొబ్బరి కాయలో..




రాజంపేట మండల కేంద్రానికి చెందిన హిందూ దశ యూత్ సభ్యులు ఏటా కొత్త ఆలోచనలతో వినాయక విగ్రహాలను, మంటపాలను ఏర్పాటు చేస్తుంటారు. యూత్ సభ్యుడు ప్రశాంత్ ఆలోచనల మేరకు ఈసారి కొబ్బరి కాయలోంచి వినాయకుడు ఉద్భవిస్తున్నట్లుగా విగ్రహాన్ని తయారు చేయించారు. ప్రజలు ఈ మండపాన్ని సందర్శించి యూత్ సభ్యులను అభినందిస్తున్నారు.

రుద్రాక్ష గణపతి..

కామారెడ్డిలోని పెద్దమ్మ గల్లీలో శివ వినాయక హిందూ యూత్ ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం ప్రత్యేకతను కలిగి ఉంది. దీనిని రుద్రాక్షలతో రూపొందించారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ గణపతిని చూడడానికి వస్తున్నారు. దీంతో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రాకపోకలతో మంటపం రద్దీగా కనిపిస్తోంది.



చంద్రయాన్ నమూనా...



కామారెడ్డి పట్టణంలోని రైల్వే కమాన్ వద్ద ప్రతిష్ఠించిన చంద్రయాన్ వినాయకుడు

కామారెడ్డి పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో న్యాయవాది రమేశ్ చంద్ కుమారుడు తరుణ్ వినాయక మండపాన్ని చంద్రయాన్ గెటప్‌లో తీర్చిదిద్దారు. చంద్రుడి పైకి రాకెట్ వెళ్లినట్టుగా రూపొందించారు. ఈ మండపం ఆకట్టుకుంటోంది.

ఇండియా ఆన్ ద మూన్..



కామారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ మట్టి వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించారు. ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన చంద్రయాన్ ప్రయోగం సక్సెస్‌ను తెలిపేలా విగ్రహం పక్కన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. విగ్రహం వెనకాల చంద్రయాన్ శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు చెబుతున్న ఫ్లెక్సీ.. ఇంకోవైపు ఆదిత్య ఎల్–1 మిషన్ ప్రయోగానికి సంబంధించిన ఫ్లెక్సీ కనిపిస్తాయి. జెడ్పీ కార్యాలయంలోకి అడుగుపెట్టగానే చంద్రమండలం మీద ఉన్నామన్న భావన కలిగేలా వాతావరణాన్ని తీర్చిదిద్దారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమేనని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆడిటోరియంలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఓటరూ నైతిక బాధ్యతగా తప్పక ఓటు వేయాలన్నారు. ఒక్క ఓటు గెలుపు, ఓటములను నిర్ణయించే అవకాశాలున్నాయన్నారు. సుస్థిరమైన ప్రజాస్వామ్య నిర్మాణం ఓటరు చేతిలోనే ఉందన్నారు. ఈ సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటు వేసే విధానంపై విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గత ఎన్నికల వివరాలు అందించాలి

గత శాసనసభ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన బ్యాంకు లావాదేవీల వివరాలు, మద్యం అమ్మకాల వివరాలతో పాటు గత ఆరు నెలల్లో జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలను వెంటనే అందజేయాలని కలెక్టర్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి గత ఎన్నికల అనుభవాలను మననం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని అధిగమించడానకి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సెక్టార్, పోలింగ్ బూత్‌ల వారీగా విచ్చలవిడిగా ధన వ్యయం చేసిన వారి వివరాలు, కుల, మత ఘర్షణలు, నియమావళిని ఉల్లంఘనలు, నేరాలు, ఘర్షణలు, కేసులకు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌డీఎం సుధీర్ భార్గవ్, ఎస్‌బీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల పర్యవేక్షకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు ప్రాధాన్యతపై విద్యార్థుల ప్రదర్శన

'అమరుల త్యాగాలను గుర్తుంచుకోవాలి'

కామారెడ్డి రూరల్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల త్యాగాలను ప్రజలు గుర్తుంచుకోవాలని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం గర్గుల్, ఇస్రోజీవాడి, తిమ్మక్‌పల్లి, గూడెం, శాబ్దిపూర్‌తండా, ఉగ్రవాయి, రాఘవాపూర్, క్యాసంపల్లి తండాలలో మేరీ మాటీ.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత కలశంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కలశంలో సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపిస్తామని, అక్కడ అమరుల స్మృతి వనం నిర్మిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇస్రోజీవాడిలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నేతలు

'కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం'

భిక్కనూరు: సీఎం కేసీఆర్‌ను కామారెడ్డినుంచి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రజలను కోరారు. గుర్జకుంట, ర్యాగట్లపల్లి గ్రామాల్లో రూ. 7.14 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయనుండడం కామారెడ్డి ప్రజల అదృష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో అమలుకు సాధ్యంకాని హామీలు ఇస్తోందన్నారు. అవినీతికి తావులేని పాలన అందిస్తామని గ్యారంటీ ఇచ్చే దమ్ము కాంగ్రెస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేశానన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చానన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, సర్పంచ్‌లు మనోరమ, మల్లారెడ్డి, తునికి వేణు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు రాజమౌళి, పాల రాంచంద్రం, కిష్టాగౌడ్, సిద్దరాములు, రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న గంప గోవర్ధన్

రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

కామారెడ్డి అర్బన్: కరీంనగర్‌లో ఈనెల 30, అక్టోబర్ 1న నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శనివారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 250 మందికిపైగా అథ్లెట్లు పాల్గొన్నారు. అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగాలలో రన్నింగ్, జంపింగ్, త్రోస్ అంశాల్లో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, దివ్య, శ్రీధర్ రెడ్డి, ప్రభులింగం, మోహన్‌రెడ్డి, సంజీవ్, రాజేందర్‌రెడ్డి, ఆంజనేయులు, రేణుక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

ఎంపికైన క్రీడాకారులు..

కె.అభిలాష్, ఎన్.శ్రీను, ఎల్.యోగి, డి.మహిపాల్, కె.ఆనంద్, ఏ.నక్షత్ర, ఎ.మనుషా, ఎం.స్రవంతి, టి.కేదార్‌సింగ్, కె.సంతోష్, బి.శ్రీనివాస్, జి.కార్తీక్, కె.నందిని, ఎల్.అఖిల, కె.స్వరూప, జె.సురేందర్, జె.అర్జున్, బి.సురేష్, బి.ఈశ్వరప్రసాద్, బి.కుర్మవతి, ఎ.సుజాత, ఆర్.నరేష్, బి.దేవీసింగ్, కె.అనిల్, ఎం.ఈశ్వర్, ఆర్.సేవాగ్, మాలోత్ నితిన్, ఎన్.ప్రేమ్, బి.నందులాల్, ఆర్.రవీందర్‌నాయక్.

గ్రూప్–1 ఆశలు ఆవిరి!

- ఏళ్లుగా కష్టపడి చదువుతున్న నిరుద్యోగులు
- పరీక్ష రద్దుతో ఆవేదన



సాక్షి, కామారెడ్డి: ఉన్నత ఉద్యోగాల మీద ఆశతో ఏళ్లపాటు పుస్తకాలతో కుస్తీలు పట్టారు. కోచింగ్‌కు వెళ్లారు. కష్టపడి చదివి గ్రూప్–1 రాశారు. క్వాలిఫై అవుతామన్న ధీమాతో చాలామంది ఉన్నారు. అయితే పేపర్ లీకవడంతో పరీక్షను రద్దు చేసినట్టు శనివారం ప్రకటన వెలువడడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

జూన్‌లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు జిల్లాలో 4,549 మంది హాజరయ్యారు. పరీక్షకు సన్నద్ధం కావడం కోసం చాలామంది గ్రామీణ నిరుద్యోగులు జిల్లాకేంద్రానికి వచ్చి గదులు అద్దెకు తీసుకుని, కోచింగ్‌కు వెళ్లారు. పలువురు రాష్ట్ర రాజధానిలో కోచింగ్ తీసుకున్నారు. పొద్దంతా లైబ్రరీలలో గడిపిన అభ్యర్థులు.. రాత్రిళ్లలో గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టారు. చాలామంది తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల మీద ఆశతో చదువుతూనే ఉన్నారు. గ్రూప్–1 టార్గెట్‌గా చాలామంది రేయింబవళ్లు కష్టపడ్డారు. కొందరైతే పండుగలు, పబ్బాలు కూడా మరిచిపోయి మరీ చదివారు. తెలంగాణ వచ్చాక తొలిసారి పరీక్ష బాగా రాసి క్వాలిఫై అయిన వారు పేపర్ లీకైందని తెలిసి నారాజ్ అయ్యారు. వారు తేరుకునేందుకు కొంత సమయం పట్టింది. ఎలాగైనా ఉద్యోగం కొట్టాలన్న పట్టుదలతో మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టారు. రెండోసారి పరీక్ష రాసి, కీ చూసుకున్నాక క్వాలిఫై అవుతామన్న నమ్మకంతో ఉన్నవారు రిజల్ట్ కోసం వేచిచూస్తున్నారు. అయితే పరీక్ష నిర్వహణలో లోపాలపై కొందరు కోర్టును ఆశ్రయించడం, కోర్టు పరీక్షను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో మళ్లీ ఆశలు ఆవిరయ్యాయి. గ్రూప్–1 నిర్వహణ విషయంలో ప్రభుత్వం సరైన విధానాలు అవలంబించకపోవడంతో ఇబ్బందిపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి మరీ చదివి..

చాలామంది నిరుద్యోగులు గ్రూప్–1 కోసం అప్పులు చేసి కోచింగ్‌లకు వెళ్లారు. పుస్తకాలు కొన్నారు. ఏళ్లుగా అద్దె గదుల్లో ఉంటూ చదువుతున్నారు. ఒక్కో నిరుద్యోగి కోచింగ్, పుస్తకాలు, రూం అద్దె, ఉండడానికి అయ్యే ఖర్చులన్నీ కలిపి కనీసం రూ.2 లక్షల దాకా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కొందరు గ్రూప్–1 రిజల్ట్ తర్వాతే పెళ్లి చేసుకుందామని పెళ్లిని వాయిదా వేసుకున్నారు. మరికొందరు పెళ్లైనా కుటుంబాన్ని ఇంటి వద్దే వదిలేసి పట్టణాల్లో ఉంటూ చదువుతున్నారు. కనీసం పండుగలకు కూడా దుస్తులు కొనుక్కోకుండా పుస్తకాలకు ఖర్చు చేశామని ఓ నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నెలల తరబడి ఇంటి ముఖం చూడకుండా చదివానని, పరీక్ష రద్దు చేయడంతో నిరాశ చెందానని మరో నిరుద్యోగి పేర్కొంటున్నాడు.

మనోవేదనలో అభ్యర్థులు

ఉద్యోగం కొట్టాలన్న కసితో ఏళ్ల తరబడిగా చదువుతున్న ఎంతోమంది నిరుద్యోగులు గ్రూప్–1 రెండు సార్లు రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తాము కష్టపడి చదివి ఉద్యోగం వస్తుందనుకుంటే ఇలా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా లైబ్రరీలో రెండుమూడేళ్లుగా గ్రూప్–1 కోసం నాలుగైదు వందల మంది ప్రిపేర్ అవుతున్నారు. ఇందులో యాభై మందికిపైగా క్వాలిఫై అవుతారని భావించారు. కానీ పరీక్ష రద్దవడంతో వారంతా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కష్టం వృథా..



కామారెడ్డి పట్టణంలో రూం కిరాయికి తీసుకుని రెండేళ్లుగా గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్నా. తొలిసారి గ్రూప్– 1 పరీక్ష నిర్వహించినప్పుడే క్వాలిఫై అయ్యాను. ఉద్యోగం పక్కా అనుకున్నా. పేపర్ లీకవడంతో పరీక్ష రద్దయ్యింది. ఈసారి ఎలాగైనా ఉద్యోగం కొట్టాలని కష్టపడ్డాను. కీ చూసుకుంటే మంచి మార్కులే వచ్చాయి. పరీక్ష నిర్వహణ లోపాలతో రద్దు చేస్తున్నట్టు కోర్టు ప్రకటించడంతో కష్టం అంతా వృథా అయ్యింది.

– రాజశేఖర్, గ్రూప్–1 అభ్యర్థి

ఎన్నో కష్టాలు పడ్డా..



తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గ్రూప్–1 నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా కొట్టాలన్న పట్టుదలతో చదివాను. ఖర్చులకోసం రెండేళ్లు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేశా. రెండేళ్లుగా కామారెడ్డిలో అద్దె గదిలో ఉంటూ ప్రిపేర్ అవుతున్నా. మొదటిసారే క్వాలిఫై అయ్యా.. అప్పుడు పేపర్ లీకై రద్దయ్యింది. ఎన్నో కష్టాలకు ఓర్చి రోజూ లైబ్రరీకి వెళ్లి ప్రిపేర్ అయ్యా. మరోసారి పరీక్ష రద్దు చేయడంతో మళ్లీ నిరాశే ఎదురైంది.

– సంతోష్, గ్రూప్–1 అభ్యర్థి

క్లుప్తంగా

ఉపాధ్యాయుల ప్రాధాన్యత ధ్రువపత్రాలను పరిశీలించండి



కామారెడ్డి టౌన్: పదోన్నతులు, బదిలీల కోసం ప్రాధాన్యత విభాగంలో పాయింట్ల కోసం ఉపాధ్యాయులు సమర్పించిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. కొందరు ఉపాధ్యాయులు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారని, దివ్యాంగులుగా అర్హత లేకున్నా కొందరు వైద్యులతో 70 శాతం దివ్యాంగులుగా ఉన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించారని వివరించారు. ఇలాంటి వారిని మళ్లీ ప్రత్యక్షంగా వైద్యాధికారులతో పరీక్షించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. అలాగే 2018 బదిలీలలో ఉపయోగించుకున్న ప్రిఫరెన్షియల్ కేటగిరీ లిస్టును బహిర్గతం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో శనివారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావియ్యకుండా వెలుతురు ఉన్నప్పుడే నిమజ్జనం చేయాలని సూచించారు. ఇరుకు గల్లీలలోకి వెళ్లకుండా, కరెంటు వైర్లను చూసుకుంటూ భారీ విగ్రహాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, సర్పంచ్ సంజీవులు, వీడీసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



పిట్లం(జుక్కల్): సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మవద్దని, సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌కొండ పేర్కొన్నారు. ఆయన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని సంత జరిగే ప్రదేశం వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్, ఏటీఎం వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది చారి, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111



గీత, కామారెడ్డి



ప్రవీణ్, నాగరాజు, సురేష్, కామారెడ్డి



శేషారావు, కామారెడ్డి



అశోక్, బాన్సువాడ



వరుణి, కామారెడ్డి



నక్క గోపి, దేవునిపల్లి



హర్షిణి, కామారెడ్డి



శ్రీనాథ్, శ్రావణి, కామారెడ్డి



ప్రశాంత్, శృతి, కామారెడ్డి



భూపతి, కామారెడ్డి



వంశీ, గర్గుల్



గీత, మాధురి, కామారెడ్డి



జ్యోతి, రుతిక, కామారెడ్డి



రుక్మిణి, శేఖర్, బాన్సువాడ



సోని,లాస్య,రిశిత, కామారెడ్డి



విష్ణువర్ధన్, శ్రీనిధి, దేవునిపల్లి



శివ జ్యోతి యూత్, ఎల్లారెడ్డి



ఉదయ్ కిరణ్,ఘన్‌పూర్(ఎం), మాచారెడ్డి

ఇళ్ల పట్టాలతో సొంతింటి కల సాకారం

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు ఇవ్వడంతో సొంతింటి కల నెరవేరుతుందన్నారు. గృహ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకొని ఆదర్శ కాలనీలుగా మార్చుకోవాలని సూచించారు.జిల్లా కేంద్రంతో పాటు, బీబీపేట, జనగామ, మాందాపూర్ గ్రామాల పేదలకు పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీలు ఆంజనేయులు, బాలమణి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, తహసీల్దార్ లత, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

బీఆర్‌ఎస్‌లో చేరిక

భిక్కనూరు: మల్లుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో శనివారం చేరారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వీరికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు పోతిరెడ్డి, నాగభూషణంగౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే అభివృద్ధి పనులు

- పెద్ద ఎక్లారలో రూ.1.96 కోట్లతో పనులు పూర్తి
- ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే హన్మంత్ సింధే

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. పెద్ద ఎక్లారలో రూ.1.96 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తి కావడంతో శనివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే, సర్పంచ్ హరిత పటేల్ ప్రారంభించారు. పెద్ద ఎక్లారలో రూ.1.39 కోట్లతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం, రూ.29 లక్షలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రూ.12.5 లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.16 లక్షలతో పల్లె దవాఖాన నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు, తాగు, సాగు నీరు, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శీను పటేల్, నాయకులు పండిత్‌రావ్ పటేల్, బస్సీ పటేల్ తదితరులున్నారు.



పెద్ద ఎక్లారలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సర్పంచ్

రైతు బీమా కాపీ అందజేత



పిట్లంలో ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న బీఆర్ఎస్ నేత వాసరి రమేష్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసరి రమేశ్ లబ్ధిదారురాలికి రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కారెగావ్‌కు చెందిన సాయవ్వ అనే మహిళా రైతు ఇటీవల మృతి చెందడంతో ఆమెకు నామినీ అయిన కుమార్తె బాలామణికి రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేసినట్లు రమేశ్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు విజయ్, మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, కారెగాం సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ రాజు, సర్పంచ్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను చెల్లించాలని మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎల్లారెడ్డి, దోమకొండ, బాన్సువాడ, పిట్లం, మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, గాంధారి మండలాల్లో ఆసుపత్రి కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో పండుగల పూట కార్మికులు పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, కార్మికులు పాల్గొన్నారు.



ఆర్ఎంవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



బోర్లంక్యాంప్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

బాన్సువాడ రూరల్: అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బాన్సువాడలో ఈ నెల 27న నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి కోరారు. శనివారం ఆమె బోర్లం క్యాంపులో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి జాబ్‌మేళా కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కరపత్రాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బీర్కూర్ రోడ్‌లోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి నిరుద్యోగ అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెస్యూమ్, ఎక్స్‌పీరియన్స్ ధ్రువపత్రాలు తీసుకు రావాలన్నారు. సర్పంచ్ నాన్కు పీర్యానాయక్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ పట్టణంలో..

బాన్సువాడ : పీబీఆర్ మెగా జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను బాన్సువాడలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, పాత బాలకృష్ణ, ఎజాస్, గురువినయ్, నర్సన్న, కిరణ్, తదితరులు ఉన్నారు.

ధర్మయుద్ధం ర్యాలీకి ముదిరాజ్‌లు తరలిరావాలి



లింగంపేటలో ధర్మయుద్ధం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ నాయకులు



పిట్లంలో..

లింగంపేట/పిట్లం(ఎల్లారెడ్డి): లింగంపేట, పిట్లం మండలాల్లో ముదిరాజ్ నాయకులు శనివారం ధర్మయుద్ధం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించకుండా మోసం చేశాయన్నారు. పార్టీలకు గుణపాఠం చెప్పడానికి కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించే ధర్మయుద్ధం ర్యాలీకి ప్రతీ ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 50 లక్షల మంది జనాభా ఉన్న ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించకుండా మోసం చేశాయన్నారు. రూ.10 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నిండా ముంచారన్నారు. 40 నియోజకవర్గాల్లో ముదిరాజ్‌ల సత్తా చూపిస్తామన్నారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన గురుకుల స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి శనివారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లు ప్రశాంతంగా ముగిసినట్లు సంస్థ నిజామాబాద్ ఆర్‌సీవో అలివేలు తెలిపారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల పాఠశాలల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని ఖాళీ సీట్లకు 277 మంది బాలురు, 217 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు



ఓల్లెపు రాజేశ్

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేట సమీపంలోని కాశీరెడ్డికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. గోపాల్‌పేటకు చెందిన ఓల్లెపు రాజేష్(27) శుక్రవారం తన స్నేహితుడు బూర్గుపల్లి బాల్‌లింగంతో కలిసి కాశీరెడ్డికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో రాజేశ్ ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. బాల్‌లింగం ద్వారా తెలుసుకున్న కుటుంబీకులు కుంట వద్దకు వెళ్లి గాలించారు. శుక్రవారం రాత్రయినా అతని ఆచూకీ లభించకపోడవంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. శనివారం ఉదయం ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది కాశీరెడ్డికుంటకు చేరుకొని స్థానిక జాలర్ల సహాయంతో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా రాజేష్ జాడ దొరకలేదు. ఈ విషయమై నాగిరెడ్డిపేట ఎస్సై రాజును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సాగర్ కాలువలో మృతదేహం

రుద్రూర్: రుద్రూర్ మండలం రాయకూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. సాగర్ కాలువలో చెట్టుకు తట్టుకొని ఉన్న మృతదేహాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు మండలంలోని చిక్కడపల్లి గ్రామానికి చెందిన యాదయ్యగా పోలీసులు గుర్తించారు. యాదయ్యకు మతిస్థిమితం లేదని, రెండు రోజులుగా గ్రామంలో కన్పించడం లేదని గ్రామస్తులు తెలిపారు. కాలకృత్యాలకు వెళ్లి కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేట సబ్ రిజస్ట్రార్ ఆఫీస్ ప్రాంతంలో శనివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. వయసు 45 ఏళ్ల వరకు ఉంటుందని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. రోడ్డు పక్కన మృతదేహం పడి ఉందన్నారు.

ఒకరి అదృశ్యం



శంకర్

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన గంగారాజుల శంకర్ అదృశ్యమైనట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. శంకర్ ఈ నెల 20న గణేశ్ మండపం వద్దకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆయన భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని టోకరా

బాన్సువాడ రూరల్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. మండలంలోని బుడిమి గ్రామానికి చెందిన చిలుక సాయిలు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఈ నెల 6న ఓ వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ లిమిట్ పెంచుతామని చెప్పాడు. క్రెడిట్ కార్డుకు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటో లింక్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. దీని కోసం ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమనగా సాయిలు సైబర్ నేరగాడు చెప్పినట్లే చేశాడు. దీంతో క్రెడిట్ కార్డు నుంచి రూ.9,875, రూ.9,356, రూ.1,852 విత్‌డ్రా అయినట్లు మెసెజ్ వచ్చింది. వెంటనే సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో రూ.9,356 హోల్డ్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీనిపై శనివారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: మహారాష్ట్ర నుంచి కామారెడ్డికి రైలులో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ ప్రాంతం నుంచి కామారెడ్డికి రైలులో గంజాయి సరఫరా జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ ప్రకాశ్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్‌లో దిగగానే రామాయంపేటకు చెందిన నవీన్, కామారెడ్డికి చెందిన పృథ్వీ, నందును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో నివసించే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: సాలూర మండలం హున్సా శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి రూ.44,860 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పెద్ద ఎడ్గి శివారులో..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి శివారులో పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం జుక్కల్ ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,400 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు.

ఫైనాన్స్ వ్యాపారిపై దాడి

నిజామాబాద్‌రూరల్: ఫైనాన్స్ వ్యాపారిపై నలుగురు దాడి చేసి గాయపర్చారు. వివరాలు.. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన అలగొండ అబ్బన్న ఫైనాన్స్ వ్యాపారం చేస్తాడు. ఆయన గతంలో కాలూర్ గ్రామానికి చెందిన నలుగురికి అప్పు ఇచ్చాడు. అంతేగాకుండా వారు అబ్బన్న దగ్గర పదేళ్ల క్రితం ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లించారు. అబ్బన్న వారిని బాకీ డబ్బులు అడిగితే ఇవ్వలేదు. ఈ క్రమంలో శనివారం అబ్బన్న నిజామాబాద్ రాగా గమనించిన సదరు వ్యక్తులు ఖానాపూర్ వెళ్దామని ఆటోలో ఎక్కించుకున్నారు. అనంతరం గిరిరాజ్ కళాశాల వైపు ఆటోను మళ్లించి కర్రలతో తీవ్రంగా కొట్టారని బాధితుడు తెలిపారు. అబ్బన్న ఫిర్యాదు మేరకు మూడో టౌన్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిన్నారులపై కుక్కల దాడి

- ఇద్దరికి గాయాలు

నందిపేట్: నందిపేటలో కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. నందిపేటలోని పాత ఐవోబీ భవనం ఎదురుగా గ్రామానికి చెందిన అక్షున్ అనే మూడేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి చేయికి గాయపరిచాయి. పక్కనున్న వారు కుక్కలను తరిమి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే బస్టాండ్ ప్రాంతంలో బోధన్‌కు చెందిన రెండున్నర ఏళ్ల కె శైలేష్‌పై కుక్కలు దాడి చేశాయి. గాయపడిన చిన్నారులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు.